క్లుప్తంగా

ఉద్యోగ విరమణ సహజం



జ్ఞాపిక అందజేస్తున్న కలెక్టర్ వెంకటేశ్ దోత్రే

ఆసిఫాబాద్అర్బన్: ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమని కలెక్టర్ వెంకటేశ్ దోత్రే అన్నారు. జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్న సజీవన్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్పీ కాంతిలాల్ పాటిల్, ఇతర అధికారులతో కలిసి సజీవన్ దంపతులను శాలువాతో సత్కరించి, జ్ఞాపిక అందజేశారు. కుటుంబసభ్యులతో సుఖ సంతోషాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు ప్రత్యేక స్థానాలు కేటాయించాలి



మాట్లాడుతున్న జాడి శేఖర్

వాంకిడి: రాజకీయాల్లో ఎస్సీలకు ప్రత్యేక రిజర్వేషన్ స్థానాలు కేటాయించాలని ఖమాన గ్రామ బౌద్ధ సమాజ్ అధ్యక్షుడు జాడి శేఖర్ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని ఖమాన గ్రామంలో మాట్లాడారు. గ్రామంలో 30 శాతం ఎస్సీ జనాభా ఉన్నారని, పదివార్డు స్థానాల్లో ఒక్కటి కూడా ఎస్సీలకు కేటాయించలేదన్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్ల ప్రకారం విద్యా, ఉద్యోగ, రాజకీయాల్లో ఎస్సీలకు సరైన ప్రాతినిధ్యం కల్పించడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో మారుతి, తిరుపతి, కిషన్, తితిందర్, అక్షయ్ కుమార్ పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు



గుంతలు పూడ్చుతున్న సిబ్బంది

సాక్షి స్పందన

కాగజ్‌నగర్ టౌన్: గుంతలతో పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారని ఈనెల 28న 'సాక్షి' ప్రచురితమైన 'గుంతల రోడ్లతో ఇబ్బందులు' అనే కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. సోమవారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా నుంచి తిరందాజ్ టాకీస్ వరకు రోడ్డుపై ఉన్న గుంతల్లో కంకర వేసి మరమ్మతులు చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు చేపడుతున్నట్లు మున్సిపల్ అధికారులు తెలిపారు.

కొనుగోళ్ల కోలాహలం



జిల్లా కేంద్రంలో రద్దీ

ఆసిఫాబాద్అర్బన్: సద్దుల బతుకమ్మ, దసరా పండుగ నేపథ్యంలో జిల్లా కేంద్రంలో కొనుగోళ్ల సందడి నెలకొంది. ప్రధాన రహదారులు వినియోగదారులు, చిరువ్యాపారులతో కిక్కిరిసిపోయాయి. రానున్న రెండు రోజులపాటు ఇదే రద్దీ ఉంటుందని వ్యాపారులు చెబుతున్నారు. పూల షాపులు, కిరాణ దుకాణాలు, ఆర్టీసీ బస్టాండ్లతో రద్దీ పెరిగింది. సెలవులు కావడంతో విద్యార్థులు, ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్న వారు స్వగ్రామాలకు చేరుకున్నారు. నూతన దుస్తులు కొనుగోలు, పండుగ సామగ్రి కొనుగోలు కోసం జిల్లా కేంద్రానికి వస్తున్నారు. పల్లెల నుంచి వచ్చే వినియోగదారులను ఆఫర్లు, స్పాట్ గిఫ్ట్‌లు అందిస్తూ వ్యాపారులు ఆకర్షిస్తున్నారు.

రేషన్‌కార్డు ఇప్పించండి

ఇచ్చోడ: గత మూడు నెలల నుంచి రేషన్ కార్డు కోసం తహసీల్దార్ కార్యాలయం చుట్టు తిరుగుతున్నా.. అధికారులు పట్టించుకోవడంలేదని జామిడి గ్రామానికి చెందిన కల్యాణి ఆరోపించారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద మాట్లాడారు. నాకు అన్ని అర్హతలు ఉన్నా.. రెవెన్యూ సిబ్బంది కొంత మంది కార్డు ఇవ్వకుండా కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారని మండిపడ్డారు. కార్యాయానికి వచ్చిన ప్రతిసారి దరఖాస్తు చేసుకున్న జిరాక్స్ ఇవ్వమని అడుగుతున్నారు. ఏదో ఒక సామాధానం చెప్పి జాప్యం చేస్తున్నారని కన్నీళ్లు పె ట్టుకున్నారు. రెవెన్యూ అధికారులు చొరవ చూపి రేషన్ కార్డు ఇప్పించాలని వేడుకున్నారు.

పంటలపై అడవిపందుల దాడులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న రైతు అగర్‌గూడ గ్రామానికి చెందిన రైతు రాగుండి సాయి. తన ఉన్న ఐదు ఎకరాల చేనులో పత్తి పంట సాగు చేశాడు. గడిచిన పదిహేను రోజులుగా ప్రతీ రోజు అడవి పందుల గుంపు చేనులోకి ప్రవేశించి పంటను ధ్వంసం చేస్తున్నాయి. పంటను రక్షించుకోవడానికి చేనులోనే రాత్రి కాపలా కాస్తున్నాడు.

- చేలల్లోనే మకాం
- తీవ్రంగా నష్టపోతున్న రైతులు



అగర్‌గూడలో పందుల దాడిలో దెబ్బతిన్న పత్తి

పెంచికల్‌పేట్: చేతికి వచ్చిన పంటలపై అడవి పందులు దాడులు చేస్తుండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నాడు. పగలు రాత్రి తేడా లేకుండా పంటలను రక్షించుకునేందుకు చేలలోనే కాపలా కాస్తున్నారు. నెల రోజుల క్రితం పత్తి చేనుకి వెళ్లిన ఎల్కపల్లి గ్రామానికి చెందిన రైతు దూగుంట నారాణయపైన అడవి పంది దాడి చేయడంతో గాయపడ్డాడు. పందుల భయంతో పంట చేనులోకి వెళ్లడానికి రైతులు జంకుతున్నారు.

12 వేల ఎకరాల్లో సాగు..

మండలంలో సుమారు 12వేల ఎకరాల్లో రైతులు పత్తి, వరి సాగు చేస్తున్నారు. కొండపల్లి, లోడుపల్లి, దరోగపల్లి, అగర్‌గూడ, ఎల్లూర్, గుండెపల్లి, నందిగామ, కమ్మర్‌గాం, మురళీగూడ, జిల్లెడ, పోతెపల్లి, పెంచికల్‌పేట్ గ్రామాలకు చెందిన రైతుల పంట పొలాలు అటవీ ప్రాంతాలకు సమీపంలో ఉంటాయి. ప్రస్తుతం పత్తి పంట కాత దశలో, వరి పంట పొట్ట దశలో ఉంది. దీంతో పెద్ద ఎత్తున అడవి పందుల గుంపులు గుంపులుగా వచ్చి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. పందుల స్వైర విహారంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంటలు కళ్ల ముందే నష్ట పోతుండటంతో అన్నదాతలు కన్నీరు మున్నీరు అవుతున్నారు.

అధికారులు స్పందించాలి



మూడు ఎకరాల్లో పత్తి పంట సాగు చేశాను. ప్రస్తుతం కాత, పూత దశలో ఉంది. గత పదిహేను రోజులుగా పెద్ద ఎత్తున అడవి పందుల గుంపులు గుంపులుగా వచ్చి దాడులు చేస్తున్నాయి. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టినా. పంటలు ధ్వంసం చేస్తున్నాయి. పలు మార్లు అధికారులకు సమాచారం అందించాం.

– ఎల్లూరి శ్రీనివాస్, రైతు అగర్‌గూడ

ఏటీఎం సెంటర్లు లేక అవస్థలు

- ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించిన ప్రజలు

తిర్యాణి: ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల్లోని లబ్ధిదారులకు నేరుగా నగదు అందించకుండా పారదర్శకత కోసం వారి బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తోంది. పత్తి, ధ్యాన్యం విక్రయ సెంటర్ నిర్వాహకులు సైతం రైతు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నారు. కానీ మండలంలో నగదు విత్‌డ్రా కోసం ఒక్క ఏటీఎం సెంటర్ కుడా లేకపోవడంతో సామాన్య జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. రోజంతా బ్యాంకు ఎదుట నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రైవేట్ వ్యక్తలను ఆశ్రయిస్తున్న ప్రజలు..

మండలం కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకులో దాదాపు పది వేలకు పైగా ఖాతాలు ఉన్నాయి. ఇప్పటికి ఒక్క ఏటీఎం సెంటర్ కుడా అందుబాటులో లేదు. ఏటీఎం సేవలు వినియోగించుకోవడం కోసం మండల కేంద్రంలో దాదాపు 30 కిలో మీటర్ల దూరం ప్రయాణించాల్సిన వస్తుందని వాపోతున్నారు. ఖాతాదారుల వేలిముద్రల ఆధారంగా నగదు విత్‌డ్రా చేసి అందిస్తున్నారు. అయితే ఇందు కోసం కమీషన్ వసూలు చేస్తున్నారు. అలాగే ఖాతాదారులకు తెలియకుండానే నిర్వాహకులు తమ ఖాతాల్లోకి నగదు బదిలీ చేయించుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదులు వస్తున్నాయి.



బ్యాంకు వద్ద క్యూలో ఖాతాదారులు (ఫైల్)

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మండల కేంద్రంలో ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలని మండలవాసులు కోరుతున్నారు...

ఏటీఎం సెంటర్ ఏర్పాటు చేయాలి



మండలంలో ఏటీఎం సెంటర్ అందుబాటులో లేకపోవడంతో స్థానిక గ్రామాల ప్రజలు దాదాపు 30 కిలో మీటర్ల దూరంలో ఉన్న గోలేటి, ఐబీ తాండూర్ తదితర ప్రాంతాలకు వెళ్లి ఏటీఎం సేవలు వినియోగించుకుంటున్నారు. అత్యవసర పరిస్థితులల్లో ప్రవేట్ వ్యక్తులు నిర్వహించే మినీ ఏటీఎం సెంటర్లను అశ్రయించి ఆర్థికంగా నష్టపోతున్నాం.

–మ్యాన రాజు, తిర్యాణి

ఘనంగా సద్దుల బతుకమ్మ



గోలేటి టౌన్‌షిప్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఆసిఫాబాద్అర్బన్/రెబ్బెన/కాగజ్‌నగర్‌టౌన్/దహెగాం: పూలనే పూజించి ప్రకృతిని ఆరాధించే గొప్ప పండుగ బతుకమ్మ. తెలంగాణ సాంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబురాలు జిల్లా వ్యాప్తంగా పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను కూడళ్ల వద్ద పెట్టి ఆటపాటలతో మహిళలు సందడి చేశారు. మహిళల నృత్యం ఆకట్టుకుంది. అనంతరం సమీంపలోని వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.



ఆసిఫాబాద్అర్బన్: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



దహెగాం: బతుకమ్మ ఆడుతున్న మహిళలు



కాగజ్‌నగర్‌టౌన్: బతుకమ్మలతో వస్తున్న మహిళలు

దీక్షభూమికి తరలిరండి



మాట్లాడుతున్న బౌద్ధ సంఘం నాయకులు

వాంకిడి: మహారాష్ట్రలోని నాగ్‌పూర్ దీక్షభూమిలో అక్టోబర్ 2న నిర్వహించే ధమ్మచక్ర పరివర్తన్ దివాస్ కార్యక్రమానికి జిల్లాలోని అంబేడ్కర్ అభిమానులు, బౌద్ధులు భారీగా తరలిరావాలని బౌద్ధ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంచిర్యాల నుంచి చేపట్టిన ధమ్మ యాత్ర సోమవారం మండలంలోని బెండార గ్రామానికి చేరుకుంది. దీక్ష భూమిలో నిర్వహించే కార్యక్రమాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అంబేడ్కర్, బుద్ధుడు చూపిన మార్గాలను అనుసరిస్తూ.. ఉత్తమ జీవనాన్ని సార్థకం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అశోక్ మహోల్కర్, ఆశన్ యశ్వంత్, శ్యాంరావు, అజేయ్, నిఖిల్, శరత్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

కాగజ్‌నగర్ టౌన్: కాగజ్‌నగర్ పట్టణంలోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవనంలో నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొత్తపల్లి శ్రీనివాస్, సెక్రటరీగా కె. శ్రావణ్, ట్రెజరర్‌గా ఎస్. రమాకాంత్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు హర్షవర్ధన్, సునీత, అనిత, కృష్ణారావు, రావుజీ, విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు న్యాయం చేయాలి'



వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

రెబ్బెన: దసరా పండగ తేదీని మార్చి సింగరేణి యాజమాన్యం కార్మికులకు న్యాయం చేయాలని ఏఐటీయూసీ బ్రాంచి ఉపాధ్యక్షుడు బయ్య మొగిళి అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏరియాలోని ఖైరిగూర ఓసీపీలో కార్మికులతో కలిసి మేనేజర్ శంకర్‌కు వినతిపత్రం అందచేశారు. దసరా, గాంధీ జయంతి రెండు ఒకే రోజున ఉండటంతో సింగరేణి కార్మికులు గనులపై పండగ జరుపుకునే పరిస్థితులు లేకుండా పోయిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గడ్డం వినోద్



శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఆసిఫాబాద్అర్బన్: దేవి నవరాత్రి ఉత్సవాలు జిల్లా కొనసాగుతున్నాయి. సోమవారం బాపునగర్ అమ్మవారిని పలువురు నాయకులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావ్, వన్ నేషన్ వన్ ఎలక్షన్ జిల్లా కన్వీనర్ అరిగెల నాగేశ్వర్‌రావ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు దర్శించుకున్నారు. అలాగే బ్రాహ్మణవాడ శ్రీ కేశవనాథ స్వామి ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు సాగుతున్నాయి. ఉత్సవ విగ్రహంతో భజనలు చేస్తూ.. పలు వీధుల్లో శోభాయాత్ర చేపట్టారు. మంగళ హారతులతో స్వాగతం పలికారు.

దర్శించుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే..

రెబ్బెన: దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ మండలంలోని ఇందిరానగర్ కనక దుర్గాదేవి, స్వయంభూ మహంకాళి ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కనక దుర్గాదేవి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు దేవార వినోద్ స్వామి ఎమ్మెల్యేకు అమ్మవారి తీర్థప్రసాదాలతో పాటు అమ్మవారి చిత్రపటం అందచేశారు. మండలం లోని నారాయణపూర్‌లో వాసవి దుర్గామండలి ఆధ్వర్యంలో మహిళలు కుంకుమార్చన నిర్వహించారు.

సరస్వతిదేవి అవతారంలో అమ్మవారు

కెరమెరి: శ్రీ సరస్వతి దేవి రూపంలో సోమవారం అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మండల కేంద్రంలో తుజాల్‌పురం కాంప్లెక్స్‌లోని దుర్గాదేవి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గత కొద్దిరోజుల నుంచి కుంకుమార్చన నిర్వహిస్తున్నారు.



పూజలు చేస్తున్న నాయకులు



సరస్వతీ దేవి రూపంలో అమ్మవారు

హిందువుల సంఘటితమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం

కెరమెరి: హిందువుల సంఘటితమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా ప్రచారక్ నాగరాజు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శివాలయం ఆవరణలో ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్లు పూర్తి చేసిన సందర్భంగా శతజయంతి ఉత్సవాలను నిర్వహించారు. పంచ పరివర్తన్ విషయాలు, కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరస్యత, స్వదేశీ, పర్యావరణం వాటి అమలు గురించి ధర్మజాగరణ సభ్యులు, ఆర్‌ఎస్‌ఎస్ సంఘ సేవకులకు అవగాహన కల్పించారు. హిందుత్వ జీవన విధానం, విశ్వశాంతికి ఆధారమని, సనాతన విలువలు హిందుత్వంలో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యనిర్వాహకులు గండేటి వెంకటేశ్వరరావు, సంపర్క ప్రముఖ్ నాగుల శ్రీనివాస్, శారీరక్ ప్రముఖ్ మహేశ్వరరెడ్డి, రామకృష్ణ, ప్రవీణ్‌గౌడ్, ధన్‌రాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగరాజు

సమస్యలు పరిష్కరించాలి

- చిత్తగూడ గ్రామస్తుల డిమాండ్
- ఎన్నికలు బహిష్కరిస్తామని వాగులో నిలబడి నిరసన

నార్నూర్: రోడ్డు, మౌలిక సదుపాయాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామానికి కనీస సౌకర్యాలు కల్పించకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను బహిష్కరిస్తామని గ్రామస్తులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని మాలేపూర్ పరిధిలోని చిత్తగూడ గ్రామస్తులు వాగు నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చిత్తగూడ గ్రామంలో మొత్తం 60 దళిత కుటుంబాలు ఉన్నాయని, చిన్నపాటి వర్షం వచ్చినా..గాలి వీచిన విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్డు సరిగా లేకపోవడంతో కనీసం బైక్ వెళ్లలేని పరిస్థితి నెలకొందన్నారు. అవ్యవసర సమయంలో ప్రమాదకంగా వాగు దాటాల్సి వస్తుందన్నారు. ఎన్నికల సమయంలో రోడ్డు, వాగుపై వంతెన నిర్మిస్తామని పాలకులు హామీ ఇస్తున్నా.. తరువాత పట్టించుకోవడం లేదన్నారు. దళిత గ్రామాలపై అధికారులు సవతి తల్లి ప్రేమను చూపిస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో శేషరావు ఘంటేవార్, బాబు వాఘ్మారే, రాము ఘంటేవార్, రోహిదాస్, రాజు, రుక్మాబి, శాంతబాయి, గిరిజబాయి, శేషుబాయి, తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రజావాణిలో అర్జీలు స్వీకరణ

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణి నిర్వహించారు. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అప్పటికే కార్యాలయానికి వచ్చిన అర్జీదారుల నుంచి మాత్రమే అధికారులు అర్జీలు స్వీకరించారు.

ట్రాఫిక్‌తో తప్పని తిప్పలు



నిలిచిపోయిన ట్రాఫిక్

కాగజ్‌నగర్ టౌన్: పట్టణంలోని ప్రధాన మార్కెట్ ఏరియాలో తోపుడు బండ్లు రోడ్లపైనే పెట్టడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. వివిధ ప్రాంతాల నుంచి కాగజ్‌నగర్ పట్టణానికి నిత్యవసర సరుకులు కొనుగోలు చేసేందుకు మార్కెట్‌కు వస్తుంటారు. కానీ పట్టణంలోని ప్రధాన మార్కెట్ ఏరియాలో కూరగాయాలు, ఉల్లిగడ్డలు, అల్లం, వెల్లులి, పండ్లు అమ్మే వారు రోడ్లపైనే బండ్లు పెట్టడడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ జామ్ కాకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

కౌటాల: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు సత్తా చాటాలని సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించి ఘన స్వాగతం పలికారు. ఆయన స్థానిక జ్యోతిబా పూలే, కుమురంభీం, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిపించేందుకు కార్యకర్తలు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ మాంతయ్య, వసంత్‌రావు, మధుకర్, భీమయ్య, తిరుపతి, బాపు, రవీందర్‌గౌడ్, గోపాల్, శ్రీనివాస్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

నాసిరకం మందులు అంటగడితే చర్యలు

దహెగాం: పత్తి పూత, కాత దశలో ఉన్నందున ఫర్టిలైజర్ దుకాణ యాజమానులు నాసిరకం మందులు అంటగడితే చర్యలు తప్పవని ఏవో రామక్రిష్ణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పంటలకు తెగుళ్లు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఏయే సమయంలో ఎలాంటి మందులు వాడాలో వివరించారు. అనంతరం సొసైటీలో యూరియా పంపిణీని పరిశీలించారు. ఆయన వెంట సొసైటీ సిబ్బంది, యజమానులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న ఏవో